ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
3★★★
జిల్లా వార్తలు
శనివారం 21 డిసెంబరు 2024




ఎల్లారెడ్డిపేటలోని బురుజు

శిథిలమైనా..
చరిత్ర పదిలం
- గ్రామాల్లో కాకతీయులకాలం బురుజులు
- నాడు రక్షణ కేంద్రాలుగా కొనసాగిన కట్టడాలు

4


సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న నాయకులు

అమిత్‌షాను పదవి నుంచి ..
తొలగించాలి
- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్
- అంబేద్కర్‌పై వ్యాఖ్యలకు నిరసన

6

సాదాబైనామాలపై ఆశలు

- భూ భారతితో మోక్షం
- పదేళ్ల నిరీక్షణకు ఉపశమనం
- జిల్లా వ్యాప్తంగా 15 వేల దరఖాస్తులు
- అమల్లోకి రానున్న ఆర్వోఆర్-24 చట్టం
- అసెంబ్లీలో తెలంగాణ భూభారతి బిల్లు-2024



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సాదాబైనామాల ద్వారా భూములు కొనుగోలు చేసిన రైతుల ఆశలు నెరవేరనున్నాయి. సాదాబైనామాల భూములకు సంబంధించి రికార్డుల లేకపోవడం, పట్టా దారులుగా గుర్తించలేని పరిస్థితులు నెలకొనడం వంటి కారణాలతో ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు దూరమవుతూ వస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసు కొచ్చిన తెలంగాణ భూ భారతి బిల్లు - 2024తో వారి నిరీక్షణకు తెరపడనుంది. అసెంబ్లీలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రవేశ పెట్టిన ఆర్వోఆర్ చట్టం - 2024 బిల్లుతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో 15 వేల మంది సాదాబైనామాలకు సంబంధించిన ఇబ్బందులు తొలగనున్నాయి.

సాదాబైనామాలకు పాస్ పుస్తకాలు

సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించి క్రమబద్ధీకరిస్తామని గత ప్రభుత్వం ప్రకటించినా అచరణలోకి రాలేదు. 2 జూన్ 2014లోగా సాదాబైనామాల ద్వారా భూ క్రయవిక్రయాలు జరిపిన రైతులకు పట్టాదారు పుస్తకాలు జారీ చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం దరఖాస్తులు స్వీకరించినా ముందుకు సాగని పరిస్థితి.

తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి పోర్టల్ ద్వారా సాదాబైనామాల రైతులకు పట్టాదారు పుస్తకాలు అందించాలని నిర్ణయించింది. ఆర్డీవో స్థాయి అధికారితో విచారణ చేపట్టి అర్హత ఉన్న దరఖాస్తులను పరిశీలించనున్నారు. మార్గదర్శకాలు ఎలా ఉండబోతున్నాయనే దానిపై రైతుల్లో ఆసక్తి నెలకొంది. గత ప్రభుత్వం 2020 సంవత్సరం నవంబరు వరకు సాదాబైనామాల దరఖాస్తులను స్వీకరించింది. జిల్లాలో 15 వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. మీసేవ ద్వారా చేసుకున్న దరఖాస్తుల్లో సిరిసిల్ల మండలంలో 428, వేములవాడ మండలం 675, వేములవాడ రూరల్ 1072, ఎల్లారెడ్డిపేట 1227, తంగళ్లపల్లి 1776, ముస్తాబాద్ 1685, గంభీరావుపేట 1403, చందుర్తి 1259, బోయినపల్లి 764, కోనరావుపేట 2690, రుద్రంగి 162, వీర్నపల్లిలో 379 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిని క్రమబద్ధీకరించే చర్యలు మాత్రం జరగలేదు. గత ప్రభుత్వం 2020 అక్టోబరు 24న ధరణి పోర్టల్ తీసుకురాగా నవంబరు 2 నుంచి అమల్లోకి వచ్చింది. కానీ అనేక ఇబ్బందుల మధ్య ధరణి కొనసాగింది. ఇందులో సాదాబైనామాలకు మోక్షం లభించలేదు.

సంక్షేమ పథకాలు దూరం

సాదా బైనామాల క్రమబద్ధీకరణ దరఖాస్తులను పరిశీలించి పట్టాదారు పుస్తకాలను జారీ చేయాల్సి ఉండగా వివిధ మిగతా 8వ పేజీలో

న్యూస్ బాక్స్

సీఎమ్మార్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఇల్లంతకుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం సీఎం సహాయనిధి చెక్కులను నాయకులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, మాజీ ప్యాక్స్ చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఎలగందుల ప్రసాద్, డైరెక్టర్లు మచ్చ రాజేశం, నర్సింహ్మారెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు మామిడి నరేష్, సంతోష్ బాబు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో టీబీ వైద్య శిబిరం

తంగళ్లపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలో టీబీ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం వైద్యాధికారి డాక్టర్ స్నేహ ఆధ్వర్యంలో వంద రోజుల నిక్షయ్ శిబిర్ ప్రోగ్రాం నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి టీబీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు జైత్యా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై విచారణకు ఆదేశం

గంభీరావుపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట ఎంపీడీవో పనితీరుపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా విచారణకు ఆదేశించారు. అంబేద్కర్ సేవారత్న జాతీయ అవార్డు గ్రహిత మంగళి చంద్రమౌళి పారిశుధ్య సిబ్బంది దుస్తుల కొనుగోలు పేరిట గ్రామ పంచాయతీ జీపీ అకౌంట్ నుంచి అధికారులు రూ.లక్షా 93 వేలు డ్రా చేశారని, నాలుగు నెలలుగా దుస్తులు ఇవ్వడం లేదని ఎంపీడీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీవో పనితీరుపై విచారణ చేపట్టాలని డిప్యూటీ జడ్పీ సీఈవోకు లేఖ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 23న సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుదారుడి సమక్షంలో ఎంపీడీవోపై విచారణ చేసి, నివేదికను అందజేయాలని ఆదేశించారు.

నూతన కార్యవర్గం

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం గోపాల్‌నగర్ - సాయినగర్ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా సొక్కి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బండారి రాములు, ఉపాధ్యక్షుడిగా బండారి లక్ష్మణ్, కోశాధికారిగా కొట్టె భాను కుమార్, ప్రచార కార్యదర్శిగా శాగాల నర్సింలు ఎన్నికయ్యారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు : ఎస్పీ


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం , డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదవుతాయని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మైనర్ల డ్రైవింగ్‌పై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహనాలు నడుపుతూ మైనర్‌లు పట్టుబడితే యజమానులపై కేసులు నమోదుచేసి జైలు తరలిస్తామన్నారు. మైనర్ల డ్రైవింగ్ చేయకుండా తల్లి దండ్రులు దృష్టిసారించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఐదు రోజుల్లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 285 వాహనాలు సీజ్ చేశామన్నారు. గతంలోనూ మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన 300 వాహనాలను సీజ్ చేశామని, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి ఈ-చాలన్ల కింద జరిమానా విధించామని అన్నారు. కారణం లేని మరణం ఒక రోడ్డు ప్రమాదమేనన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించవద్దన్నారు. రుద్రంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో మైనర్ డ్రైవింగ్ చేయడంతో ఒక వ్యక్తి మరణించాడని, ఈ కేసులో మైనర్ తల్లి దండ్రులపై కేసు నమోదు చేశామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమైతే పదేళ్ల జైలు శిక్ష పడేలా చట్టాలు ఉన్నాయన్నారు. తల్లి దండ్రులు, వాహన యజమానులు పిల్లలకు వాహనాలు ఇచ్చే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ కార్యక్రమం ద్వారా అవగామన కార్యక్ర మాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిరి సిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, టౌన్ సీఐ కృష్ణ, మొగిలి, ఎస్సైలు శ్రీకాంత్, మల్లేశం, శ్రీనివాసరావు పాలొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని మామిండ్ల రిశ్విత రాష్ట్రస్థాయి జావలిన్ త్రో పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సాబీర్ పాషా ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో రిశ్విత ఉత్తమ ప్రతిభ కనబరి చింది. ఈ సందర్భంగా రిశ్వితకు ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్, మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అనసూయ, మాజీ ఎంపీటీసీ స్రవంతి అభినందనలు తెలిపారు

నియామకం

కోనరావుపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా నాగారం గ్రామానికి చెందిన కీసర శ్రీనివాస్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు మేకల పర్శరాం ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ సంక్షేమం కోసం కృషి చేస్తానని, నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన

తంగళ్లపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలో బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల దత్తత గ్రామం రాళ్లపేటలో రైతులకు శుక్రవారం విత్తన శుద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేందర్ రైతులకు 'కూనారం సన్నాలు' అనే వరి రకం విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన విత్తన శుద్ధి ప్రాముఖ్యత వివరించారు. దత్తత గ్రామ కమిటీ సభ్యులు డాక్టర్ సతీష్, డాక్టర్ సంపత్, రాళ్ళపేట మాజీ సర్పంచ్ పర్శరాములు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి


మొక్క నాటుతున్న ఎంపీడీవో సత్తయ్య

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి సంరక్షించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఎంపీడీవో సత్తయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్తయ్య మాట్లాడుతూ వృక్షాలతోను మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లో ప్రజలను చైతన్యపర్చి మొక్కలు నాటేలా విద్యార్థులు చూడాలన్నారు. ప్రిన్సిపాల్ వనజకుమారి, అధ్యాపకులు సత్యనారాయణ, పర్శరాములు, చంద్రమౌళి, విష్ణుప్రసాద్, సాగర్, భూమక్క, కవిత, గీత, ప్రవళిక పాల్గొన్నారు.

గణేష్ కుటుంబానికి ప్రభుత్వం అండ


వివరాలను సేకరిస్తున్న ఏడీ సాగర్

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న దూస గణేష్ కుటుంబానికి నేతన్న చేయూత పథకం కింద ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన మరమగ్గాల కార్మికుడు దూస గణేష్ ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలను చేనేత జౌళిశాఖ ఏడీ సాగర్ విచారణ చేపట్టి సేకరించారు. గణేష్ కార్మికుడిగా పనిచేస్తున్న సమయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేతన్నకు చేయూత, నేతన్న బీమా వంటి పథకాలల్లో చేరినట్లు, ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు వివరించారు.

పెద్దూర్‌లో గణిత దినోత్సవం


పోటీలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ ఎంపీహెచ్‌ఎస్‌లో శుక్రవారం గణిత దినోత్సవం నిర్వహించారు. శ్రీనివాసరామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవంలో భాగంగా విద్యార్థులు గణితం గుర్తులు, సూత్రాలతో ముగ్గులను వేశారు. డ్రాయింగ్ టెస్ట్, ఫార్ములాటెస్ట్, నిత్యజీవితంలో గణితం ఆవశ్యకతపై ఉపన్యాస పోటీలను నిర్వహించారు. సిరి సిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని నాగుల భాగ్యరేఖ విద్యార్థులు తయారు చేసిన గణిత నమూనాలను పరిశీలించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని చక్రవర్తుల రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి అనుమతులు

చందుర్తి డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చందుర్తి, ఉమ్మడి మేడిపల్లి మండలాల రోడ్డు నిర్మాణానికి స్టేజ్ వన్ అనుమతులు జారీ చేస్తూ కేంద్ర ప్రభుత్వం, మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్, క్లైమేట్‌వారు అనుమతులు జారీ చేశారు. చందుర్తి-మోత్కురావుపేట గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం పూర్తయితే మేడిపల్లి మండలం నుంచి వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు, హైదరాబాద్ వెళ్లే వారికి సమయం ఆదావడంతోపాటు దూర భారం తగ్గనుంది. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చందుర్తి మోత్కురావుపేట రోడ్డు నిర్మాణం చేయాలని కోరుతూ గతంలో అనేక ఆందోళనలు చేపట్టారు. ప్రస్తుతం ప్రభుత్వ విప్ హోదాలో అటవీ శాఖ అనుమతుల మంజూరి కోసం మంత్రులను, అధికారులను కోరారు. రోడ్డు నిర్మాణానికి స్టేజ్ వన్ అనుమతులకు సహకరించిన కేంద్ర మంత్రికి, ముఖ్యమంత్రికి, రాష్ట్ర అటవీ శాఖ మంత్రికి ఆది శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి మొదటి దశ అనుమతులు రావడంపై చందుర్తి, మేడిపల్లి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆటలు ఆడేదెలా?


కిష్టునాయక్‌తండా క్రీడా ప్రాంగణంలో ట్రాక్టర్, ట్యాంకర్

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండా, కోరుట్లపేటలో క్రీడా ప్రాంగణాలు క్రీడాకారులకు అందుబాటులోకి రాకుండాపోయాయి. కిష్టునాయక్‌తండా పంచాయతీ భవనం ఎదుట ఖాళీ స్థలాన్ని అధికారులు క్రీడా ప్రాంగణానికి కేటాయించారు. సరిపడే స్థలం లేక ఆ స్థలంలోనే పంచాయతీకి చెందిన చెత్త సేకరణ ట్రాక్టర్, నీటి ట్యాంకర్లను నిలుపుతున్నారు. కోరుట్లపేటలో ఊరికి చివర ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. చెట్లు పెరిగి ఆడు కునేందుకు వీలు లేకుండాపోయింది. సంబంధిత అధికారులు స్పందించాలని, క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తీసుక రావాలని మండల ప్రజలు కోరుతున్నారు.


కోరుట్లపేటలోని క్రీడా ప్రాంగణంలో పెరిగిన చెట్లు

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

- మండల ప్రజల ఇబ్బందులు
- ఇన్‌చార్జి అధికారుల పాలన
- పట్టించుకోవాలని విజ్ఞప్తి

వీర్నపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో అధికారులతోపాటు వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు అసౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నారు. వీర్నపల్లి మండలంలోని తహసీల్దార్, మండల పరిషత్, పోలీస్ స్టేషన్, వ్యవసాయ కార్యాలయాలకు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మండలంలో విద్యాధికారి భవనం నిర్మించినా అందులో మండల పరిషత్ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్నారు. మరో వైపు ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తిస్థాయి అధికారులు లేక ఇన్‌చార్జిలతో కాలం వెల్లదీస్తున్నారు.


అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

● ఇరుకు గదులతో అవస్థలు

ప్రతీ రోజు ప్రజలతో రద్దీగా ఉండే తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇరుకుగదులతో జనాలు నిడబడలేని పరిస్థితి. భూ రిజిస్ట్రేషన్లకు వచ్చే జనాలు కూర్చోవడానికి వీలు లేకపోవడంతో ఆరు బయట నిరీక్షిస్తున్నారు. భూ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్, అటవీశాఖ అధికారుల వసతి గృహంలో ఏర్పాటు చేయడంతో గదులు చిన్నవిగా ఉండడంతో ఫిర్యాదుదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

● అందని ఆరోగ్య సేవలు

మండలం ఏర్పడి ఏళ్ల గడుస్తున్నా మారుమూల అటవీ తండాలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందుబాటులోకి రాలేదు. మండలంలో రెండు ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నా సరిపడా వైద్యులు లేకపోవడంతో గిరిజనులకు మెరుగైన వైద్యం అందడం లేదు. ఆరోగ్య కేంద్రాన్ని నిర్మిస్తామంటూ ప్రతిపాదనలు వచ్చినా ఇప్పటివరకు నిర్మాణం చేపట్టలేదు.

పక్కా భవనాలు నిర్మించాలి

-మల్లారపు అరుణ్ కుమార్, వీర్నపల్లి



మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తేవాలి. ప్రజలకు అన్ని సేవలను అందించేందుకు పూర్తి స్థాయి అధికారులను నియమించాలి. స్థానికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో గిరిజనులు వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

గురుకుల విద్యార్థుల ఇంటిదారి

● వరుస ఘటనలతో తల్లిదండ్రుల్లో ఆందోళన



పెద్దాపూర్ గురుకులంలో తొలగించిన పెద్దచెట్లు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 20 (ఆంధ్రజ్యోతి) : పెద్దాపూర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు భయం పట్టుకుంది. దీంతో ఒక్కొక్కరుగా ఇంటి దారి పడుతున్నారు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు ఆస్పత్రి పాలు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో కలవరం మొదలైంది. గురుకుల పాఠశాలలో 416, కళాశాలలో 130మంది విద్యారులు చదువుతున్నారు. వరుసగా విద్యార్థులు అస్వస్థతకు గురికావడం వాటికి కారణాలు తెలయక పోవడంతో తల్లిదండ్రులు భయంతో తమ తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్నారు. కళాశాల విద్యార్థులు మినహా పాఠశాల విద్యార్థులు దాదాపు ఖాళీ అయ్యారు. నాలుగు నెలల క్రితం గురులంలో జరిగిన ఘటనలతో రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. తాజాగా మళ్లీ ఇద్దరు విద్యార్థులకు పాము కాటు అనే అనుమానాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టి భరోసా కల్పించేంత వరకు తమ పిల్లలను పంపించమని కలెక్టర్ సత్యప్రసాద్‌కు తల్లిదండ్రులు తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

గురుకులం ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో పాములు, కిటక పురుగులు రాకుటండా తిరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పాఠశాలలో గదుల వేనుక పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డి, పాత గదులను తొలగించి, పాఠశాలలో పారిశుధ్యం పనులు చేసి అన్ని వసతులను కల్పించేందుకు అధికారులు పనులు చేపట్టారు. కలెక్టర్ సత్యప్రసాద్ పర్యవేక్షణలో అధికారులతో గురుకులంలోని చెత్త, పిచ్చి మొక్కలు, ప్రహరీ గోడకు ఉన్న రంధ్రాలు మూసివేయడం, శానిటేషన్ పనులు చేపట్టారు. గురుకులం పెద్దచెట్లు ఉండడంతో కోతులు బెడద నుంచి రక్షణ కోసం వాటిని తొలగిస్తున్నారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను క్షుణంగా పరిశీలించి పనులు చేయిస్తున్నారు.

చికిత్స పొందుతున్న గురుకుల విద్యార్థుల డిశ్చార్జి

గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న ఇద్దరు విద్యార్థులు ఓం కారి అఖిల్, బోడ యశ్వంత్ డిశ్చార్జి అయినట్లు మెడికల్ అధికారి అంజిత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను ఉపాధ్యాయులు కోరుట్లలోని వేరు వేరు ఆసుపత్రులకు తరలించారు. ఆర్డీవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిలను గమనించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు కలెక్టర్‌కు సమాచారం అందించారు. రెండురోజుల నుంచి చికిత్స పొందుత్ను వారి ఆరోగ్యం కుదటపడడంతో శుక్రవారం వైద్యులు డిశ్చార్జి చేశారు.

వీధి కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి



మృతి చెందిన గొర్రెలు

ధర్మారం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వీధికుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతిచెందిన ఘటన మండలంలోని నర్సింగాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బద్దం సుధాకర్‌రెడ్డి రాత్రి పడుకునే ముందు గొర్రెల మంద చుట్టూ కంచె ఏర్పాటు చేశాడు. గురువారం రాత్రి సమ యంలో వీధి కుక్కలు మందపై దాడి చేయడంతో 12 గొర్రెపిల్లలు మృతి చెందాయి. తనకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని సుధాకర్ రెడ్డి కోరాడు.

శిథిలమైనా.. చరిత్ర పదిలం

● గ్రామాల్లో కాకతీయులకాలం బురుజులు

● నాడు రక్షణ కేంద్రాలుగా కొనసాగిన కట్టడాలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 20 ఆంధ్రజ్యోతి): కాకతీయుల కాలం నాటి బురుజులు శిథిలమైనా చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. శత్రువుల రాకను పసిగట్టేందుకు నిర్మించిన కట్టడాలు ఆ నాటి వైభవానికి చిహ్నాలుగా గుర్తింపు పొందుతున్నాయి. సుమారు 900ఏళ్ల కిందట ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు మండలంలోని నారాయణపూర్, సింగారం, పదిర, గొల్లపల్లి, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లో బురుజులు నిర్మించారు. ఈ ఎత్తైన రాతి కట్టడాలు ఆనాడు రక్షణ కేంద్రాలుగా కొనసాగాయి. పలు గ్రామాల్లో శిథిలావస్థకు చేరినా కాకతీయుల నాటి కళా వైభావాన్ని చాటుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పలువురు చరిత్రకారులు బురుజుల ప్రత్యేకతను భవిష్యత్ తరాలకు అందించే ప్రయత్నం చేస్తున్నారు.



నారాయణపూర్‌లో శిథిలమైన బురుజు



పదిరలో ధ్వంసమైన బురుజు

● ఎత్తైన రాతి కట్టడాలు.. సైనికుల పహారా కేంద్రాలు

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు మండలంలోని నారాయణపూర్, సింగారం, పదిర, గొల్లపల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో కాకతీయుల కాలంనాటి సామంత రాజైన సింగమమహారాజు బొప్పాపూర్ కేంద్రంగా రాచర్లకోటను నిర్మించారు. ఇక్కడి నుంచి పరిపాలన సాగించేవారని చరిత్రకారులు, స్థానికులు చెబుతున్నారు. ఆయా గ్రామాల పరిధి, ప్రజల సంఖ్యకు అనుగుణంగా శత్రువులు దండయాత్ర చేయకుండా ఉండేందుకు ఎత్తైన రాతి కట్టడాలు చేపట్టారు. బురుజుల నిర్మాణానికి మట్టి, బరువైన రాళ్లను వినియోగించిన ఆనవాళ్లున్నాయి. బురుజు నిర్మాణంలో శత్రువులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. బురుజు పైకి ఎక్కేందుకు నేల నుంచి సుమారు రెండు అడుగుల ఎత్తులో ఒక్కరే వెళ్లేలా మెట్లను నిర్మించారు. నిచ్చెన సహాయంతో ఒక్కరిద్దరూ సైనికులు మాత్రమే పైకి ఎక్కిన తర్వాత నిచ్చెన తీసేసేలా కట్టడాలు ఉన్నాయి. బురుజుకు నాలుగు వైపుల మూడు నుంచి నాలుగు రంధ్రాలను ఏర్పాటు చేశారు. దూర ప్రాంతం నుంచి ఎవరైన వస్తున్నారా? అని సైనికులు చూసేవారు. శత్రువులు దండయాత్రకు వస్తే అందులో నుంచి తుపాకులతో కాల్చేవారు. బురుజు పైభాగంలోనూ నాలుగు వైపుల ఇటుకలు, మట్టితో గోడ, మధ్యలో రాళ్లతో ఓ గద్దె నిర్మించారు. దానిపై సైనికులు పహారా కాసేవారని చరిత్రకారులు చెబుతున్నారు. అంతేకాకుండా ఎండావాన నుంచి రక్షణగా ఓ షెడ్డులాంటిది ఏర్పాటు చేసుకున్న ఆనవాళ్లు కూడా ఉన్నాయి.

● చరిత్రకు చిహ్నంగా..

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు మండలంలోని గొల్లపల్లి, పదిర, నారాయణపూర్, సింగా రం, తిమ్మాపూర్ గ్రామాల్లోని బురుజులు నాటి కళాకారుల ప్రతిభను చాటుతున్నాయి. శిథిలావస్థకు చేరుకున్నా కాకతీయుల కాలంలోని పాలన విధానాన్ని తెలియజేస్తున్నాయి. మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం పరిసరాల్లో నాలుగు బురుజులు ఉండేవి. ప్రస్తుతం రెండు కనుమరుగయ్యాయి. ఓ బురుజుకు మాజీ సర్పంచ్ నేవూరి వెంకటొరెడ్డి మూడేళ్ల కిందట మరమ్మతు చేయించారు. ఆయన పదవి కాలంలో గణతంత్ర, స్వాతంత్ర దినోత్సవాలకు బురుజుపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. నారాయణపూర్, సింగారం, తిమ్మాపూర్, గొల్లపల్లి, పదిర తదితర గ్రామాల్లోని బురుజులు శిథిలవస్థకు చేరుకున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు బురుజులను పరిరక్షించాలని, కాకతీయులకాలం నాటి సంపదను భవిష్యత్ తరాలకు అందించాలని ప్రజలు కోరుతున్నారు.



ఎల్లారెడ్డిపేటలోని బురుజు పైభాగంలో ధ్వంసమైన రాతికట్టడం



గొల్లపల్లిలోని బురుజు

బురుజులు అద్భుత కట్టడాలు



కాకతీయులు కాలంనాటి బురుజులు అద్భుత కట్టడాలు. మా ఊరిలో నాలుగు బురుజులుండేవని మా తాత చెబుతుండేవారు. ఇప్పుడు రెండు మాత్రమే ఉన్నాయి. వాటిని చూస్తే ఆశ్చర్యమేస్తోంది. మట్టి, పెద్దపెద్ద రాళ్లతో కట్టారు. ప్రస్తుతం శిథిలమవుతున్నాయి. అధికారులు స్పందించాలి. నాటి చరిత్ర భవిష్యత్ తరాలకు అందేలా చూడాలి.

- వనం రాజు, యువకుడు, ఎల్లారెడ్డిపేట

పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దాలి



బురుజులను పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దాలి. వాటి నిర్మాణానికి దేవాలయాలకు వినియోగించిన రాళ్లను వాడిన ఆనవాళ్లు కనిపిస్తాయి. దూరం నుంచి శత్రువుల కదలికలను కనిపెట్టేందుకు బురుజులు ఉపయోగపడ్డాయి. గ్రామాల్లోకి రజాకార్ల చొరబాటును ముందే కనిపెట్టి ఎదిరించేవారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత ముందుకొచ్చి శిథిలావస్థకు చేరుకుంటున్న బురుజులకు మరమ్మతు చేపట్టాలి. స్వాతంత్ర, గణతంత్ర దినోత్సవం రోజున జాతీయ జెండాలను ఆవిష్కరించాలి. చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలి.

- రెడ్డి రత్నాకర్‌రెడ్డి, చరిత్రకారుడు

బురుజు మరమ్మతు చేపట్టాం



మా గ్రామంలోని బురుజు శిథిలావస్థకు చేరుకుంటే నాటి చరిత్రను కాపాడాలనే లక్ష్యంతో మరమ్మతు చేయించాం. బురుజుకు నాలుగు వైపుల త్రివర్ణ పతాకంలోని మూడు రంగులను వేయించి అందంగా తీర్చిదిద్దాం. బురుజుపై విద్యుద్దీపాలను ఏర్పాటు చేయించాం. ఏటా గణతంత్ర, స్వాతంత్ర దినోత్సవం రోజున జాతీయ జెండాను ఆవిష్కరించాం. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం.

- మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి- ఎల్లారెడ్డిపేట

తప్పిపోయిన చిన్నారి

● వెతికి అప్పగించిన పోలీసులు



చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ వీరప్రసాద్

వేములవాడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వివాహ వేడుకలో పాల్గొనేందుకు తల్లిదండ్రులతో కలిసి వేములవాడకు వచ్చిన ఓ రెండేళ్ల హన్సిక అనే చిన్నారి తప్పిపోయిన ఘటనలో సదరు చిన్నారిని పోలీసులు క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ కథనం మేరకు.. జగిత్యాల జిల్లా కొడిమ్యాలకు చెందిన రమేష్-రమ్య దంపతులు గురువారం బంధువుల పెళ్లి కోసం వేములవాడకు వచ్చారు. రాత్రి బంధువుల ఇంటి వద్ద బస చేశారు. శుక్రవారం తెల్లవారుజామున బాలిక కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు కుమార్తె కోసం వెతకడం ప్రారంభించారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభు అనే యువకుడు తనకు రెండేళ్ల పాప కనిపించినట్లు పోలీసులకు సమాచారం అందించి పాపను పోలీసులకు అప్పగించాడు. దీంతో పోలీసులు ఆ బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సుందిల్ల గ్రామానికి చెందిన గిరుగల శ్రీకాంత్(18) వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. గోదావరిఖనిలోని పండ్ల దుకాణంలో పనిచేస్తున్న శ్రీకాంత్ ఈనెల 18న రాత్రి సుందిల్లకు ద్విచక్రవాహనంపై తిరిగి వస్తూ మార్గమధ్యలో విద్యుత్ పోల్‌ను ఢీకొన్నాడు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది శ్రీకాంత్‌ను గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శ్రీకాంత్ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసునమోదు చేశారు.

కవిత్వాన్ని నడుపుతున్న ఖాలిద్...

● ఆటో డ్రైవర్‌గా ఉంటూ కవితల సృజన...



ఆటోలోనే కవిత్వం రాస్తున్న ఖాలిద్

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ షాసాబ్ స్ట్రీట్‌లో నివసించే మహమ్మద్ ఖాలిద్ వృత్తి రీత్యా ఆటో డ్రైవర్. కవిత్వం సృజిస్తూ నటన, మిమిక్రి రంగాల్లోనూ ప్రతిభ చూపుతున్నారు. ఖాలిద్ 10వ తరగతివరకు మాత్రమే చదువుకున్నారు. ఆటో కొను క్కొని నడుపుతూ జీవనం వెళ్లదీస్తున్నారు. తెలంగాణరచయిత వేదిక ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న ఎన్నీల ముచ్చట్ల ప్రభావంతో కవి కావాలనుకున్నారు. తీరిక సమయాల్లో కవితలు రాయడం ప్రారంభించారు. అలా ఆయన వంద కుపైగా కవితలు రాశారు. మనమంతా ఒక్కటే పేరుతో కవితా సంపుటిని వెలువరించారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో తన కవిత్వాన్ని వినిపిం చారు. రోడ్డు సేఫ్టీ క్లబ్‌లో సభ్యుడిగా ఉంటూ హరితహారం, రోడ్డు భద్రతా వారోత్సవాలు, అవినీతి నిరోధక దినోత్సవం వంటి కార్యాక్రమాల్లో పాలు పంచుకున్నారు. పలు లఘు చిత్రాల్లో నటించారు. పలు పురస్కారాలు అందుకున్నారు.

కులం నుంచి వెలేసిన పెద్దలను శిక్షించండి

● మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

● సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుల పెద్దలు తన కుటుంబాన్ని కులం నుంచి వెలేశారని, మానసికంగా వేధిస్తున్నారని ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండల కేంద్రానికి చెందిన కొర్రి రమేశ్ గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకుంటూ తీసిన సెల్ఫీ వీడి యో శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో తన కుటుంబాన్ని కుల పెద్దలు బహిష్కరించడంతో మానసికంగా కుంగిపోతున్నామని, కుల పెద్దల పేర్లు పేర్కొంటూ గోడును వెల్లబోసుకున్నాడు ఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఎస్సై తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు.. మరో వైపు పోలీసులు రమేశ్ ఆత్మహత్యకు యత్నించిన ప్రదేశాన్ని తెలుసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుడి ఫిర్యాదుతో కుల పెద్దలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

108 అంబులెన్స్‌లకు సుస్తీ

● వారాల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం ● అత్యవసర సమయాల్లో బాధితులకు తప్పని అవస్థలు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లాలోని 108 అంబులెన్స్‌లు మొరాయిస్తున్నాయి. మరమ్మతులకు నోచుకోకుండా వారాలు, నెలల తరబడి రిపేర్ షెడ్డులకే పరిమితమవుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడే ఈ వాహనాలపై పట్టింపు కరువయ్యింది. దీంతో పక్క మండలాల అంబులెన్స్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. సమయానికి అంబులెన్స్‌లు రాకపోవడంతో రోగులు, క్షతగాత్రులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుంటున్నారు. జిల్లాలో ఉన్న సగానికి పైగా వాహనాలను తరచూ మరమ్మతులు చేయిస్తూ నడిపిస్తున్నారు. జిల్లాలో వైద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న కలెక్టర్ అంబులెన్స్‌లపై దృష్టి పెట్టకపోవడం గమనార్హం. జిల్లాలో 14 మండలాలకు 14 అంబులెన్స్‌లు ఉండాలన్నది ప్రభుత్వం ఉద్దేశ్యం. జిల్లాలో నూతనంగా వచ్చిన అంతర్గాం అంబులెన్స్‌తో పాటు ఒక నియోనాటల్, ఎనిమిది అంబులెన్స్‌లు ఉన్నాయి. జిల్లాలోని పెద్దపల్లి, కమాన్‌పూర్, రామగుండం, పాలకుర్తి, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల, కమాన్‌పూర్ మండలాలు అంబులెన్స్‌లు ఉన్నాయి. మండలానికి ఒక్క అంబులెన్స్ ఉండాల్సి ఉండగా, పది 108 అంబులెన్స్‌లు మాత్రమే రోగులను చేరవేస్తున్నాయి. ఇందులో చాలా వాహనాలు తరచూ మోరాయిస్తుండడంతో ఏడాది క్రితం ధర్మారం, మంథని, సుల్తానాబాద్, పాలకుర్తిల అంబులెన్స్‌ల స్థానంలో కొత్త 108 వాహనాలను ప్రభుత్వం కేటాయించింది. అయితే మిగతా అంబులెన్స్‌ల పరిస్థితి అలాగే ఉంది. ఒక్కో అంబులెన్స్ రోజుకు కనీసం మూడు నుంచి 10కేసులను కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్ ఎంజీఎమ్‌కు తరలిస్తుంటాయి.

ఆయా మండలానికి సంబంధించి వాహనానికి సామర్థ్యానికి మించి కేసులు వస్తూ ఉంటా యి. రిప్లేస్ అయిన అంబులెన్స్‌లు కాకుండా మిగతావి కాలం చెల్లినవే ఎక్కువ ఉన్నాయి. కానీ వాటిని మర మ్మతు చేయిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. వారాల తర బడి మరమ్మతులకు పంపించడంతో పక్క మండలాల వాహనాలపై భారం పడుతోంది. దీంతో రోగులను తరలించేందుకు అధిక సమయం పడుతోంది. రోగి పరిస్థితిని బట్టి బంధువులు ఆందోళన చెందాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. వాహనంలో తరలించేటప్పుడు మధ్యలో మోరాయిస్తే పక్క మండలాల అంబులెన్స్‌లకు సమాచారం ఇవ్వాల్సి వస్తోంది. ఈ లెక్కన రోగులు, క్షతగాత్రులు, గర్భిణుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇదిలా ఉండగా గోదావరిఖని, కమాన్‌పూర్‌లకు చెందిన వాహనాలను నెలరోజుల క్రితం స్క్రాప్‌నకు వేసేందుకు కరీంనగర్ షెడ్డులో ఉంచారు. వీటిని మరమ్మతులు చేయించి నడిపించేందుకు కానీ, వాటి స్థానంలో కొత్తవి తీసుకవచ్చేందుకు కానీ చర్యలు తీసుకోవడం లేదు. ఓదెల అంబులెన్స్ ఎటువెళ్లినా మరమ్మతులకు గురవుతోంది. వాహన బయలుదేరే ముందే అదే దారి వెంట లింకు అంబులెన్స్‌లకు సమాచారం ఇస్తూ వెళుతోంది. అయితే వరంగల్, కరీంనగర్ తరలించాలంటే ఆయా ప్రాంతాల వాహనాలకు లింక్‌చేసి పంపి స్తున్నారు. అవి ఎక్కువ దూరం నడిచే పరిస్థితి లేకపోవడం కారణంగా వాహనం బయలుదేరే ముందే అక్కడి వాహనాలకు సమాచారం ఇచ్చి రోగులను అందులోకి మార్చి ఆస్పత్రులకు తరలిస్తున్నారు. ఉదాహరణకు మంచిర్యాల నుంచి వరంగల్ ఎంజీఎమ్‌కు రోగులను తరలించాలంటే సుమారు ఐదారు అంబులెన్స్‌లు మార్చాల్సిన పరిస్థితి నెలకొంది.

ఈక్రమంలో మార్గ మధ్యలో ఏన్నో సంఘటనలు చోటుచేసుకున్నా అవి బయటకు రావడం లేదు. ఇక్కడి పరిస్థితి ఇలా ఉండ గానే ప్రభుత్వం జిల్లాకు నాలుగు కొత్త అంబులెన్స్‌లను కేటాయించింది. అందులో ముత్తారం, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్, అంత ర్గాం మండలాలకు అంబు లెన్స్‌లను కేటాయించింది. అయితే అందులో అంతర్గాం మినహా మిగతా అంబు లెన్స్‌లన్నీ వెనక్కి పంపించారు. ఇప్పుడున్న అంబులెన్స్ లతో రోగుల ప్రాణాలకు భరోసా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో ఆదుకునే అంబులెన్స్‌లపై ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తు న్నారు. దీనిపై అధికార యంత్రాంగం, జిల్లా ప్రజాప్రతి నిధులు ప్రత్యేక చొరవ చూపి కాలం చెల్లిన వాహనాల స్థానంలో కొత్త వాహనాలు, అలాగే మండలానికి ఒక అంబులెన్స్ కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.



మొరాయిస్తున్న అంబులెన్స్ (ఫైల్)



బాధితులను మరో వాహనంలోకి మార్చుతున్న సిబ్బంది(ఫైల్)

● వాహనాలు పని చేయకపోతే ఉద్యోగికి గైర్హాజరు..

108 అంబులెన్స్‌లో ఒక పైలెట్, ఒక్క ఎమర్జెన్సీ మెడి కల్ టెక్నీషియన్ కలిపి ఇద్దరి చొప్పున ఉంటారు. 108 అంబులెన్స్‌లు మరమ్మతులకు గురై షెడ్డుకు వెళ్తే వీరికి వేతనాల్లో కోత ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో పని చేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కరువైందని వారు వాపోతున్నారు. రాత్రిపగలు తేడా లేకుండా నిత్యం పని చేసే తమపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని, వాహనాలను మార్చి తమకు నిత్యం పని కల్పించాలని వారు కోరుతున్నారు.

ఒకరి ఆత్మహత్య

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామంలో సుంకరి రమేశ్(46) అనే వ్యక్తి శుక్రవారం ఉదయం కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రమేశ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండేళ్లుగా భార్యతో గొడవలు జరుగుతుండడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురవడంతో పరీక్షలు చేయించుగోగా క్యాన్సర్‌గా వైదుల్య నిర్ధారించారు. భార్య, పిల్లలు తనతో కలిసి ఉండాలని పలుమార్లు కుటుంబ సభ్యుల సమక్షంలో పంచాయితీ పెట్టిన వారు రాలేదు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రమేశ్ తల్లి కొమరమ్మ గమనించి ఇరుగు పొరుగు వారికి చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేసుకుని వివరాలు సేకరించారు. కాగా తన ఆత్మహత్యకు భార్య జయ, ఇద్దరు కుమారులు, మామ, బావమరది కారణమంటూ సూసైడ్ నోట్ రాసి ఉన్నట్లు సమాచారం. రమేశ్ తల్లి కొమురమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మల్యాలలో అగ్నిప్రమాదం

మల్యాల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రంలోని ఒర్రెగడ్డ ప్రాంతంలో ఓ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగి గృహోపకరణాల కాలిపోయాయి. సునిత అనే మహిళ తమ ఇంట్లో దేవుని ముందు దీపం వెలిగించి బయటకు వెళ్లింది. కొద్దిసేపటికి దీపం నుంచి మంటలు పెరిగి ఇంట్లో వ్యాపించాయి. దీంతో పెంకుటిల్లు పై కప్పునకు నిప్పు అంటుకుంది. సునిత ఇంటికి తిరిగి వస్తూ మంటలను గమనించి చుట్టుపక్కల వారికి తెలపడంతో ఆమెతో పాటు స్థానికులు మంటలను ఆర్పివేశారు. ఈ సంఘటనలో చిన్నపాటి గృహోపకరణాల దగ్ధం అయ్యాయి.

యువకుడి అదృశ్యం

సైదాపూర్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలకేంద్రంలోని వెన్కేపల్లి గ్రామానికి చెందిన కామారపు శ్రీకాంత్(25) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్ ఇంటి నుంచి గురువారం ఉదయం బైక్(టీఎస్02ఈకె1215))పై బయటకు వెళ్లాడు. ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులు, తెలసిన వారిని అడిగినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం శ్రీకాంత్ తల్లి కామారపు బుచ్చవ్వ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బుచ్చవ్వ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తిరుపతి తెలిపారు.

క్రమబద్ధీకరణ అయ్యేదెన్నడో..?



వారంతా కాంట్రాక్టు లెక్చరర్లు. నిత్యం విద్యార్థులకు పాఠాలు చెబుతున్న వారు ఎప్పుడో ఒకప్పుడు తమ ఉద్యోగాలు రెగ్యులర్ కాకపోతాయా అనే ఆశతో ఎదురుచూస్తున్నారు. కాంట్రాక్టు లెక్చరర్లు కావడంతో వేతనాలు కూడా నెల నెలా అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా వారికి అందే వేతనాలు కూడా సరిగ్గా అందకున్నా నెట్టుకొస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణకు నిర్ణయం తీసుకుని ప్రక్రియ ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా కొంతమందిని రెగ్యులర్ చేసింది. ఖాళీ పోస్టుల లెక్కతేలిన అనంతరం మిగిలిన వారిని రెగ్యులర్ చేస్తామని హామీనిచ్చింది. అనంతరం ఎన్నికలు జరిగి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరికొంత మందిని క్రమబద్ధీకరించింది. ఇంకా కొంత మంది కాంట్రాక్టు ఉద్యోగుల ఆశ మాత్రం తీరలేదు. దీంతో ప్రస్తుతం వారంతా ఆందోళన చెందుతున్నారు.

- జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్ల ఎదురుచూపులు
- ఐదు నెలలుగా అందని వేతనాలు
- రాష్ట్రంలో 420 మంది కాంట్రాక్టు లెక్చరర్ల అవస్థలు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

జగిత్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎన్నోఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు.. తమఉద్యోగాల క్రమ బద్ధీకరణ (రెగ్యులరైజేషన్) కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. కాంట్రాక్టు లెక్చరర్ల కొలువులను క్రమ బద్ధీకరించే ప్రక్రియ ప్రారంభించి రెండేళ్లు పూర్తయినా ఇంతవరకు సగం మంది ఆశలు కూడా నెరవేరలేదు. ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్, జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణకు గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆమేరకు రాష్ట్రంలో 3,538 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు ఉండగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 మే మొదటి వారంలో 3,093 మందిని క్రమ బద్ధీకరించింది. పోస్టులు లేవనే కారణంతో మిగిలిన 445మంది జూనియర్ కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించకుండా నిలిపి వేసింది. ఖాళీ పోస్టుల లెక్క తేలిన అనంతరం మిగిలిన వారిని రెగ్యులర్ చేస్తామని హామీనిచ్చింది. ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో క్రమ బద్ధీకరణ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొంత మంది అధికారులు పోస్టులు లేవంటూ ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇవ్వడంవల్ల తమకు అన్యాయం జరిగిందని వాపోతున్నారు. అయితే రాష్ట్రంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం గత నెలలో 25మంది జూనియర్ కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించింది. ఇంకా 420 మంది కాంట్రాక్టు లెక్చరర్ల ఉద్యోగాలు రెగ్యులరైజ్ కావాల్సి ఉందంటు న్నారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగు లను రెగ్యులర్ చేయొద్దని, ఇప్పటికే రెగ్యులర్ చేసిన వారిని తొలగించ వద్దు అని ఇటీవల కోర్టు తీర్పు ఇవ్వడంతో తమ ఉద్యో గాలు రెగ్యులరైజ్ అయ్యే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కరుణించి ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేసి ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతున్నారు.

● ఐదు నెలలుగా అందని వేతనాలు..

చాలీచాలని జీతాలతో అనేక సంవత్సరాలుగా విద్యార్థులకు బోధిస్తున్న కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లను ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో భార్యా పిల్లలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూలై 2024 నుంచి వేతనాలు అందడం లేదంటున్నారు. సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక సమస్యలవల్ల వేతనాలు అందడం లేదని వాపోతున్నారు.



జగిత్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోధన చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్

కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి



17 ఏళ్లుగా చాలీచాలని వేతనంతో పనిచేస్తున్నాను. మా తోటివారిని గత ప్రభుత్వం క్రమబద్ధీకరించి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ మమ్ముల్ని రెగ్యులర్ చేయకుండా నిలిపివేసింది. ఇప్పటికైనా మాపై దయ చూపి ముఖ్యమంత్రి వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని వేడుకుంటున్నాను.

- నలువాల శ్రీనివాస్, కాంట్రాక్టు లెక్చరర్, జగిత్యాల

వేతనాలు సక్రమంగా అందించాలి



రాష్ట్రంలో జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలి. ఏళ్ల తరబడి పనిచేస్తున్నప్పటికీ ఉద్యోగాలు రెగ్యులరైజ్ కాకపోవడం వల్ల మానసికంగా ఆందోళనకు గురవుతున్నాము. అయిదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. వేతనాలు ఏ నెలకు ఆ నెల సక్రమంగా అందించాలి.

- శంకరయ్య, కాంట్రాక్టు లెక్చరర్, జగిత్యాల

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీఎంకప్ పోటీల నిర్వహణలో భాగంగా ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను ఆదివారం నిర్వహిస్తామని జిల్లా యువజన క్రీడాశాఖాధికారి బి శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని అకాడమిక్ హైట్స్ పాఠశాల మైదానంలో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఉదయం 10 గంటలకు మైదానంలో రిపోర్టు చేయాలని సూచించారు. పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను ఈ నెల 27 నుంచి హన్మకొండలో నిర్వహించే తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన వైష్ణవి



కోచ్ మధుకర్‌తో వైష్ణవి

సుల్తానాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ఖోఖో క్రీడాకారిణి జి. వైష్ణవి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన ఖేలో ఇండియా శిక్షణా కేంద్రంలో అంతర్జాతీయస్థాయి ఖోఖో క్రీడాకారుడు, కోచ్ గెల్లు మదుకర్ ఆధ్వర్యంలో వైష్ణవి ఖోఖోలో శిక్షణ పొందుతోందని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సురేష్ తెలిపారు. ఈ మేరకు సుల్తానాబాద్‌లో జరుగుతున్న సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలలో వైష్ణవిని ప్రత్యేకంగా అభినందించారు. ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు కేరళ రాష్టంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుందని ఆయన తెలిపారు. వైష్ణవిని గెల్లు మదుకర్‌తో పాటు సీఐ సుబ్బారెడ్డి, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ముస్త్యాల రవీందర్, అమిరిశెట్టి తిరుపతి, పెటా కార్యదర్శి దాసరి రమేష్ తదితరులు అభినందించారు.

ఘనంగా వేంకటేశ్వర కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

రాయికల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వేంకటేశ్వర స్వామి-పద్మావతిల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించిన ఈ కల్యాణానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మచ్చ నారాయణ, ఉపాధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి, జనరల్ సెక్రటరీ మచ్చ గంగాధర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, బాలె శేఖర్, తుమ్మల సదాశివా రెడ్డి, కౌన్సిలర్ కన్నాక మహేందర్, పురోహితులు శ్రీకాంత్, వేణుగోపాల స్వామి పాల్గొన్నారు.

ఆర్టీసీ రాయితీలు వినియోగించుకోవాలి

భగత్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అందిస్తున్న రాయితీలు, పథకాలను ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు అన్నారు. శుక్రవారం కరీంనగర్ బస్‌స్టేషన్ ఆవరణలో కరీంనగర్ రీజియన్‌లోని 11 డిపోల పరిధిలోని విలేజ్ బస్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అందిస్తున్న పథకాలు రాయితీలపై విలేజ్ బస్ ఆఫీసర్లు ప్రయాణికులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో అద్దె ప్రాతిపదికన అందిస్తున్న బస్సు ఛార్జీలను గణనీయంగా తగ్గించిన నేపథ్యంలో అద్దె బస్సులు బుక్ చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అరుణాచలం క్షేత్రానికి ప్రత్యేక చొరవ చూపి రెండు బస్సులను బుక్ చేయించిన హుస్నాబాద్ డిపో విలేజ్ బస్ ఆఫీసర్ వీజే రెడ్డి, అద్దె బస్సులను ఎక్కువగా బుక్ చేసినందుకు గాను కరీంనగర్‌కు చెందిన వీఎల్ నారాయణను శాలువాతో సత్కరించారు. సమావేశంలో డిప్యూటి రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి యాభై మంది బస్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి క్షేత్రంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనబంధ ఆలయాల్లో కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని తిరుగుపయనమయ్యారు.

రాజన్న సేవలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం నాగిండ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ ఏఈవో, పీఆర్వో రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ తిరుపతిరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలకు సీఎం బాధ్యత వహించాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర హాస్టళ్ల కన్వీనర్ రంజిత్‌కుమార్

గణేష్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురుకుల హాస్టల్ విద్యార్థుల మరణాలకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం అంటే గురుకుల విద్యార్థులు పిట్టల్లా రాలిపోవడమేనా అని ప్రశ్నించారు. మెట్‌పల్లి పెద్దాపూర్ గురుకులంలో నాలుగు నెలల్లో ఎనిమిది మంది విద్యార్థులు పాము కాటుకు గురైతే ఇద్దరు మరణించారన్నారు. ఉపముఖ్యమంత్రి హాస్టల్‌కు వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పినా ఆచరణకు నోచుకోలేదని తెలిపారు. హాస్టల్స్ సమస్యలపై హైకోర్టు జడ్జితో విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పూసల విష్ణు, బామాండ్ల నందు, శ్రీవర్ధన్, యోగేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రేపు ట్రినిటీ రామానుజన్ ఒలింపియాడ్ టెస్ట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి మనోహర్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాళ్లు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గణితశాస్త్రవేత్త రామానుజన్ జన్మదినం పురస్కరించుకొని పదోతరగతి విద్యార్థులకు ట్రినిటీ రామానుజన్ ఒలింపియాడ్ టెస్టును ఆదివారం నిర్వహిస్తున్నట్లు ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు లెవల్-1 పరీక్షను నిర్వహించగా 12,356 మంది పరీక్ష రాశారని అన్నారు. వారిలో 2,368 మంది విద్యార్థులు లెవల్-2కు అర్హత సాధించారని, వారికి ఈనెల 22న ఒలింపియాడ్ టెస్టును నిర్వహిస్తామన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ప్రైమ్ క్యాంపస్, ఏసీ బాయ్స్ క్యాంపస్, ఏసీ గర్ల్స్ క్యాంపస్‌లలో పరీక్ష నిర్వహిస్తామని అన్నారు. లెవల్-2 పరీక్షలో ఉత్తమప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా 10వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా 7,500, తృతీయ బహుమతిగా 5,000, నాలుగో బహుమతిగా 3,000, ఐదో బహుమతిగా 2,000, ఆరు నుంచి 10 ర్యాంకుల వారికి 1,500, 20 మందికి 1,000 రూపాయల చొప్పున బహుమతులను ప్రధానం చేయడంతోపాటు మెడల్, మెమోంటో, ప్రశంసాపత్రాలను అందజేస్తామని ప్రకటించారు. దీంతో పాటు లెవల్-2 పరీక్షల్లో 80 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాలలో 10 నుంచి 100శాతం వరకు ఫీజు రాయితీ ఇస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని పదోతరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా మహిళలకు రాష్ట్రస్థాయి మిద్దెతోట అవార్డు



దుబ్బాక వనజ

కరీంనగర్ కల్చరల్/జమ్మికుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు రాష్ట్రస్థాయి మిద్దెతోట అవార్డుకు ఎంపికయ్యారు. తుమ్మేటి రఘూత్తంరెడ్డి రైతు నేస్తం మిద్దెతోట పురస్కారానికి కరీంనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు దుబ్బాక వనజ, జమ్మికుంటకు చెందిన పుల్లూరి వెంకట రాజ్యలక్ష్మి ఎంపికయ్యారు. సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, పండ్లు, పూల సాగు చేస్తున్న మిద్దెతోట రైతులను ప్రోత్సహించడానికి రైతు నేస్తం ఫౌండేషన్ ప్రతీ యేటా పురస్కారాలు ప్రదానం చేస్తోంది. ఈ నెల 23న గుంటూరులో జరిగే సభలో వీరు పురస్కారాన్ని అందుకోనున్నారు. పురస్కా రానికి ఎంపికయిన వనజను సిటీ టెర్రస్ గార్డెన్ సభ్యులు ప్రణీత, అపర్ణ, స్వాతి మధు, భారతి, లావణ్య, శిరీష, మమత, వి సమత అభినందించారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ ప్రకృతి ప్రేమికురాలిగా దశాబ్ద కాలంగా చేస్తున్న పనికి గుర్తింపు వచ్చిందన్నారు. రసాయనాలు లేని ఆహారం పొంద డానికి తాను చిరు ప్రయత్నం చేశానని తెలిపారు.



పుల్లూరి వెంకటలక్ష్మి

జమ్మికుంటకు చెందిన పుల్లూరి వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఐదేళ్లుగా తాము మిద్దె తోట నిర్వహిస్తున్నామన్నారు. సేంద్రియ పద్ధతిలో తా ము కూరగాయలు, ఆకుకూరులు పండిస్తు న్నామని చెప్పారు. తమకు ప్రేరణ కలిగించిన తుమ్మేటి రఘొత్తంరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన పేరిట ఇచ్చే అవార్డును తనను ఎంపిక చేసిన రైతునేస్తం ఫౌండేషన్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

దోపిడీ ముఠా అరెస్టు

- రూ.5 లక్షల విలువ గల బంగారం, 10 వేల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల కేంద్రంలో ఈ నెల 13వ తేదీన దోపిడీకి పాల్పడిన దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ మున్నీసుల శ్రీనివాస్, చిప్పబత్తుల తులసయ్య, బక్కనపల్లి అరుణ్, యశోద శ్రీనివాస్, సైదు సహదేవ్, రత్నం మాణిక్యం, ముగునూరి కిరణ్ కుమార్ ఒక గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. కొన్ని రోజుల నుంచి గుప్త నిధుల కోసం గాలిస్తున్నారు. ఎక్కడా గుప్త నిధులు దొరకకపోవడంతో ఎలాగైనా డబ్బులు సంపాదించాలని భావించారు. ఈ క్రమంలో బీర్‌పూర్‌లో డబ్బులు, బంగారం ఉన్న కాసం ఈశ్వరయ్య ఇంటిని దొంగతనానికి ఎంచుకున్నారు. ఇద్దరు వృద్ధులు ఇంట్లో ఉన్నారని తెలుసుకుని 13వ తేదీన రాత్రి మంకీ క్యాప్‌లు ధరించి, బొమ్మ తుపాకీలు పట్టుకుని కిరణ్‌కుమార్, అరుణ్, తులసయ్య, మునీశ్వర్, శ్రీనివాస్‌లు నెంబర్ లేని రెండు ద్విచక్ర వాహనాలపై అర్ధరాత్రి కాసం ఈశ్వరయ్య ఇంటికి వెళ్లి అతడిపై దాడి చేశారు. అతడి భార్యను కొట్టి నోట్లో గుడ్డలు కుక్కి, బంగారంతో పాటు ఇంట్లో ఉన్న డబ్బులు తీసుకుని తుమ్మేనాలకు వెళ్లినట్లు ఎస్పీ తెలిపారు. దొంగలు ధర్మపురి మండలం తుమ్మేనాల గుట్ట వద్ద ఉన్నారని తెలుసుకున్న పోలీసులు డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి శుక్రవారం ఆరుగురు దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. వారి వద్ద రూ.5 లక్షల విలువ గల బంగారం, రూ.10 వేల నగదు, రెండు బొమ్మ తుపాకులు, 6 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. చాకచక్యంతో దొంగలను పట్టుకున్న సీఐ కృష్ణారెడ్డి, ఎస్సైలు కుమార స్వామి, సుధాకర్, శ్రీధర్ రెడ్డి, దత్తాత్రేయ, హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ తదితరులను ఎస్పీ అభినందించి, ప్రోత్సాహకరంగా నగదును అందించారు.

డయల్ యువర్ ఆర్ఎంకు స్పందన



సమస్యలు వింటున్న ఆర్ఎం బి రాజు

భగత్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమానికి స్పందన లభించింది. ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి రాజు ప్రయాణికుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌ను స్వీకరించారు. మొత్తం 14 ఫోన్ కాల్స్ వచ్చాయని, వీటిని పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత డిపో మేనేజర్లకు ఆదేశాలు జారీ చేస్తామని వివరించారు. సలహాలు, సూచనలు అందించిన ప్రయాణికులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

వాహనదారుల చెంతకే పెట్రోల్, డీజిల్

- ఊరూరా తిరిగి క్యాన్ల ద్వారా సరఫరా చేస్తున్న డెలివరీ బాయ్స్



ఖాసీంపేటలో ద్విచక్ర వాహనదారులకు పెట్రోలు పోస్తున్న డెలివరీ బాయ్

గన్నేరువరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండలం హైవేకు దూరంగా ఉంటుంది. ప్రజా రవాణా సౌకర్యమూ తక్కువగానే ఉంటుంది. ఏ అవసరం వచ్చినా ప్రజలు సొంత వాహనాలపైనే కరీంనగర్ తదితర ప్రాంతాలకు వెళుతుంటారు. వ్యవసాయానికి ట్రాక్టర్లూ పెద్ద సంఖ్యలోనే వినియోగిస్తుంటారు. మండలంలో పెట్రోల్ బంక్‌లు సరిపడా లేకపోవడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు.

దీన్ని గమనించిన ఓ వ్యాపారి పెట్రోల్, డీజిల్‌ను డోర్ డెలివరీ చేయడం ప్రారంభించాడు. మండలంలోని పారువెల్ల, ఖాసీంపేట, యాస్వాడ, గన్నేరువరం, మైలారం, మాదాపూర్, హన్మాజిపల్లి, గోపాల్‌పూర్, జంగపల్లి గ్రామాలకు ఆటో ట్రాలీలో 5, 10, 20, 40 లీటర్ల క్యాన్ల ద్వారా పెట్రోల్, డీజిల్‌ను తీసుకువస్తాడు. బంక్‌లో ధరకంటే ఒక్కో లీటర్‌కు అదనంగా ఒక రూపాయి తీసుకొని ఫోన్ చేసిన వారికి ఇంటి వద్దకు వచ్చి సరఫరా చేస్తున్నారు. దీంతో రైతులు తమ ట్రాక్టర్లకు పెద్ద మొత్తంలో అవసరం పడే డీజిల్‌ను ఒక్క ఫోన్ కాల్‌తో ఇంటి వద్దనే పొందుతున్నారు. ఆయా గ్రామాల్లోని ద్విచక్ర వాహనదారులు పెట్రోల్ బంకులకు వెళ్లకుండా వారి ఇంటి వద్దనే పెట్రోల్‌ను కొంటున్నారు. ఈ పద్ధతితో తమ ఇబ్బందులు తీరాయని మండల వాసులు అంటున్నారు.



గన్నేరువరంలో రైతులకు డీజిల్ విక్రయిస్తున్న డెలివరీ బాయ్

● సమయం ఆదా అవుతుంది..



- తోట రాజేందర్, రైతు, మైలారం,

ఒక్క ఫోన్ చేయగానే ఇంటి వద్దకు వచ్చి పెట్రోల్, డీజి ల్‌ను సరఫరా చేయడం వల్ల మాకు సమయం ఆదాఅవుతుంది. మా గ్రామానికి దగ్గరలో బంక్ లేకపో వడంతో గతంలో వేరే ప్రాంతాల్లోని బంక్‌కు వెళ్లి క్యాన్లలో తెచ్చుకునే వాళ్లం. దీంతో చాలా సమయం వృథా అయ్యేది. ఇప్పుడు డోర్ డెలివరీ సేవలతో సమయం ఆదా అవుతుంది. లీటర్‌కు ఒక్క రూపాయే అదనంగా తీసుకుంటుండడంతో పెద్దగా భారం పడడం లేదు.

న్యూస్ బాక్స్

ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, నాయకులు శుక్రవారం భూమి పూజ చేశారు. ఆలయాన్ని రాతితో నిర్మించేందుకు సభ్యులు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్రముఖ వైద్యుడు సత్యనారాయణ స్వామి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తంగళ్లపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బద్దనపల్లిలో మాజీ రెడ్డి సంఘం అధ్యక్షుడు కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు కనమేణి చక్రధర్ రెడ్డి పరామర్శించారు. శుక్రవారం మృతుని కుటుంబ సభ్యులతో పాటు మృతుని సోదరుడు జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు కూర అంజిరెడ్డిని సైతం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్తు శ్రీనివాస్ రెడ్డి, మందాటి తిరుపతి తదితరులు ఉన్నారు.

ఒకరి రిమాండ్

వేములవాడ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నంబర్ మార్చి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న అనుముల భాస్కర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ శుక్రవారం తెలిపారు. బోయినపల్లి మండలం నీలోజుపల్లికి చెందిన అనుముల భాస్కర్ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నాడు. వేములవాడ పరిధిలోని నందికమాన్ వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సర్వే వేగవంతం చేయాలి

ధర్మపురి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని ధర్మపురి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని పలు వార్డులను శుక్రవారం సం 'ర్శించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులో ఎన్యూమరేటర్లు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. సర్వే సమయంలో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకరావాలన్నారు. మున్సిపల్ మేనేజర్ బాలె గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నాయకుల పరామర్శ

వీర్నపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం అడవిపదిరలో బహుజన సాంస్కృతిక వేదిక డప్పు కళాకారుడు మాట్ల బాబు(47) శుక్రవారం మృతిచెందగా కుటుంబసభ్యులను నాయకులు పరామర్శించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్, గ్రామస్థులు కోరారు.

అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలి

● ప్రజా సంఘాల నాయకుల డిమాండ్ ● అంబేద్కర్‌పై వ్యాఖ్యలకు నిరసన



ఎల్లారెడ్డిపేటలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యాలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అమిత్‌షా దేశ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్, మాల మహానాడు రాష్ట్ర నాయకుడు రాగుల రాములు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్య క్షుడు మంద అనిల్, సీఐటీయూ నాయకులు అన్నల్ దాస్ గణేష్, కుర్ర రాకేష్, రమేష్‌చంద్ర, గుండెల్లి కళ్యా ణ్, సాయిభరత్, శివ, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మాల మహానాడు ఆధ్వర్యంలోని నాయకులు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. స్థానిక పాత బస్టాండ్ ప్రాంతంలో కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. కేంద్ర మంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజుకుమార్, రామచంద్రం, సందీప్, నర్సింలు, భాను, రవి, జితేందర్, డేవిడ్, అనిల్, శంకర్, శ్రీనివాస్, దేవానందం, రాజేందర్, వెంకటేశ్, రాజు, రాకేశ్, రాజు, సత్తయ్య, రామకృష్ణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్రమంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షుడు లక్కం బాబు, కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ గిరిజన కోఆర్డినేటర్ భూక్య గజన్ లాల్ ఖండించారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులతో కలిసి శుక్రవారం నిరసన చేపట్టారు. అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని, కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మదన్‌లాల్, సంతోష్, లచ్చిరాం, దేవరాజు, రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలో మాల మహానాడు ఆధ్వర్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను ఏక వచనముతో సంబోధించి అవమానపరిచిన దానికి నిరసన వ్యక్తం చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేసినట్లు చెప్పారు. అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు శ్రీనివాస్, నీరటి అనిల్, జనార్ధన్, యాస రాజం, తదితరులు ఉన్నారు.

చందుర్తి : కేంద్రమంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాలని, క్షమాపణ చెప్పాలని తెలంగాణ మాల మహానాడు సంఘం జిల్లా కన్వీనర్ నీరటి శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహనికి శుక్రవారం తెలంగాణ మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవహేళన చేసి మాట్లాడిన మాటలకు నిరసనలు తెలుపుతూ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారన్నారు. పార్లమెంటు సాక్షిగా అమిత్‌షా మాటలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల కమలాకర్, జిల్లా నాయకులు దేవస్వామి, మెడికల తిరుపతి, మాదాసు స్వామి, ఆసినిపర్తి సురేష్, రొండి దేవయ్య ఈసరి దేవదాస్ ఎడ్ల లింగయ్య, గ్రామాల్లోని సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: రాజ్యాంగంపై జరిగిన చర్చలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ గ్రామంలో శుక్రవారం భారత రాజ్యంగం బుక్, అంబేద్కర్ చిత్రపటంతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ దేశ యువత అంబేద్కర్ ఆలోచన విధానంలో నడుస్తుందని, యువతను పక్కదారి పట్టించేందుకు అమిత్‌షా మూర్ఖపు ఆలోచన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి అంబేద్కర్ అందించన సేవలు ఎవరూ మర్చిపోవద్దన్నారు. అంబేద్కర్‌తోనే సబ్బండ వర్గాలు చట్ట సభల్లో అడుగు పెట్టామన్న సంగతి గుర్తుంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చిట్ల శ్రీనివాస్, రోమాల ప్రవీణ్, ఎన్నారం సాగర్, దినేష్, శ్రీకాంత్, ఇర్ఫాన్, ప్రణయ్, సాయి తదితరులు ఉన్నారు.



వేములవాడలో నిరసన తెలుపుతున్న నాయకులు

కార్మికుల ఆత్మహత్యలను నివారించాలి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల ఆత్మహత్యలను నివారించాలని పవర్‌లూం కార్మిక సంఘం(ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో నిర్వహించిన పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంను అనుసరించిన వస్త్ర పరిశ్రమ యజమానుల అనుకూల విధానాల ఫలితంగా ప్రస్తుతం సిరిసిల్లలో నేత కార్మికుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. పట్టణానికి చెందిన పవర్‌లూం కార్మికుడి దూస గణేష్ ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ముందస్తు అరెస్ట్

వేములవాడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆటో యూనియన్ కార్మికుల చోలో అసెంబ్లీ కార్యక్రమాన్ని పోలీసులు వేములవాడలో భగ్నం చేశారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపులో భాగంగా హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడికి సిద్ధమవుతున్న ఆటో కార్మికులను శుక్రవారం తెల్లవారుజామున వేములవాడ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. వేములవాడ ఆటో యూనియన్ మాజీ అధ్యక్షుడు బత్తుల దేవరాజు, నాయకులు బొజ్జ సుకుమార్, గుడిసె వాసు, సయ్యద్ ఉమర్, మహ్మద్ రఫీని ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో వేలాది మంది ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఉపాధి లేక 72 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల ప్రకారం ఆటో డ్రైవర్లకు 12 వేల రూపాయల చొప్పున చెల్లించాలని, ఉచిత బస్సు ప్రయాణం రద్దు చేయాలని కోరారు.



పోలీస్ స్టేషన్‌లో ఆటో కార్మికులు

ఇల్లంతకుంట: అసెంబ్లీ ముట్టడికి ఆటోడ్రైవర్లు వెలుతున్నారనే సమాచారం మేరకు శనివారం పోలీసులు ఆటోడ్రైవర్లను ముందస్తు అరెస్టు చేశారు. ప్రభుత్వం మహిళలకు ఉచితంగా ఆర్టీసీలో ప్రయాణం కల్పించడం ద్వారా తాము జీవనోపాధి కోల్పోయామని ఆటో డ్రైవర్లు పేర్కొన్నారు.

ఉద్యమాలతోనే హక్కులు సాధించుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాలతోనే హక్కులు సాధించుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎనగందుల వెంకన్న అన్నారు. కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరాహార దీక్షలు శుక్రవారానికి 11వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ సమగ్ర శిక్షలో 14 విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం దీక్ష శిబిరంలో ఉద్యోగులు సామూహిక భోజనాలు చేసి నిరసన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఇప్పపూల దేవేందర్, బుర్ర జలేందర్, జయలక్ష్మీ, నీరజ, వెంకటరమణ, పద్మ, నరేందర్ పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో ఉద్యోగులు

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరి సాగు సమయంలో అనుమతి లేని విద్యుత్ వ్యవసాయ మోటార్ల కనెక్షన్లను తొలగిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడుతూ మండలంలోని గొల్లపల్లి, దేవునిగుట్టతండా గ్రామాల్లోని రైతులకు సమాచారం అందించకుండా కనెక్షన్లు తొలగించడంతో పొలాలు ఎండిపోతున్నాయన్నారు. నెల రోజుల ముందు నోటీసులు అందించాలన్నారు. సెస్ అధికారుల తీరుతో ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందన్నారు. అధికారులు సమాయనుకూలంగా వ్యవహరించాలని సూచించారు. నాయకులు రాంరెడ్డి, రాజేందర్, గౌస్, రాజునాయక్, భాస్కర్, బాల్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

అక్రమ సంపాదనకు కేరాఫ్ బీఆర్ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న చక్రధర్ రెడ్డి

ముస్తాబాద్, డిసెంబర్ 15, (ఆంధ్రజ్యోతి): అక్రమ సంపాదనకు కేరాఫ్ బీఆర్ఎస్ నాయకులేనని కాంగ్రెస్ పార్లమెంట్ కో కన్వీనర్ చక్రధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ముస్తాబాద్ మండలకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పదేళ్లలో బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చారని, వందల ఎకరాల భూములను పట్టాలు చేసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్న కేకే మహేందర్ రెడ్డిని ఆదరించాలని కోరారు. మాజీ ఏఎంసీ చైర్మన్ అంజన్‌రావు, మండల అధ్యక్షులు రంజాన్ నరేష్, సొసైటీ డైరెక్టర్ దేవేందర్ పాల్గొన్నారు.

ముగిసిన సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో అథ్లెటిక్స్, ఆర్చరీ, బాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, యోగా, చెస్, కిక్ బాక్సింగ్, ఉష్యూ, జూడో, టేబుల్ టెన్నిస్, క్యారం బోర్డ్, కరాటే, పవర్ లిఫ్టింగ్ పోటీలను వ్యవసాయ శాఖ జిల్లా అధికారి అఫ్జల్‌బేగం, ఆర్టికల్చర్ జిల్లా అధికారి కేఆర్ లత, ఫిషరీస్ జిల్లా అధికారి సౌజన్య ప్రారంభించారు. జిల్లా స్థాయి సీఎం కప్ పోటీల్లో మండలాల నుంచి జట్ల(మహిళలు, పురుషులు) నుంచి ప్రతిభను కనబరిచారు. సాయంత్రం మినీ స్టేడియంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి అజ్మీరా రాందాస్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ నెల 27 నుంచి రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు జిల్లా క్రీడాకారులను పంపనున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడలను విజయవంతం చేసిన అఫీషియల్స్, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, క్రీడల వివిధ అసోసియేషన్స్ అధ్యక్షులు అభినందనలు తెలిపారు.



పోటీలో పరుగు తీస్తున్న క్రీడాకారులు

కేటీఆర్‌ను జైల్లో వేయాలని కుట్ర

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ తీరును బీఆర్ఎస్ ఎండగడుతుంటే ఓర్వలేక కేటీఆర్‌ను జైల్లో పెట్టాలని కుట్ర చేస్తున్నారని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం చేసిన తప్పులను తప్పుగా చూపుతూ లగచర్ల సంఘటనను కేటీఆర్ ప్రజల్లోకి తీసుకెళ్లారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధి కారంలో ఉన్నా బాధ్యతగల పార్టీగా కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ నిర్మాత్మకమైన ప్రతిపక్షంగా పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుకలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అణచివేయాలని చూస్తున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఈ ఫార్ములను గత ప్రభుత్వం తీసుకొచ్చిందని, ప్రజలకు దీనిపై అవగాహన కల్పించామని అన్నారు. వాహనాల మ్యాన్ ఫ్యాక్చరింగ్‌తో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని కేటీఆర్ ఆలోచన చేశారన్నారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిందన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా కేటీఆర్ ఎలక్ట్రికల్ వాహనాలను పరిచయం చేయాలని ఫార్ముల ఈవీఎస్ రేస్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారన్నారు. బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, తోట ఆగయ్య

పరిపాలన చేతగాకనే కేసులు

ఇల్లంతకుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరిపాలన చేతకాకనే పసలేని కేసులు పెడుతున్నారని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌కు పెట్టుబడులు తేవాలనే లక్ష్యంతోనే ఈఫార్ముల కార్ రేస్‌లు నిర్వహించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆరోపణల్లో ఒక్క నిజమూ లేదన్నారు. కేసు న్యాయస్థానంలో నిలవదన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించి జైలు జీవితం గడిపిన వారికి ఇలాంటి కేసులు ఎదుర్కోవడం పెద్ద సమస్య కాదన్నారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. శాసనసభలో చర్చకు సిద్ధమని కేటీఆర్ పేర్కొంటున్నా ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తోందన్నారు. నియోజకవర్గానికి గత ప్రభుత్వంలో వచ్చిన నిధులతోనైనా అభివృద్ధి చేయాలని సూచించారు. సమావేశంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి, సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, ప్యాక్స్‌చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి, నాయకులు కేవీఎన్ రెడ్డి, తడకపెల్లి భూమయ్య, కొయ్యడ భాస్కర్, సలీం, ఒర్సుల రాములు, అంజయ్య, రాజారాం, నవీన్, రాజయ్య, ఇమ్రాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

సాదాబైనామాలపై ఆశలు

(3వ పేజీ తరువాయి)

కారణాలతో గత ప్రభుత్వం పెండింగ్‌లోనే పెట్టింది. కోర్టులో దాఖలైన పిటిషన్లకు గత ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతోనే పరిష్కారం లభించలేదు. దీంతో రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు దూరమయ్యారు. రైతు బంధు, రైతు బీమా, బ్యాంకురుణాలు, రుణమాఫీ వంటి పథకాలను అందుకోలేకపోయారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్వోఆర్-2024 చట్టం సాదాబైనామాల క్రమబద్ధీకరణకు ఉపయోగపడు తుందని భావిస్తున్నా రు. కొత్తగా ప్రవేశ పెట్టిన ఈ చట్టాన్ని పారదర్శకతగా అమలు చేయనున్నారు. కొత్త చట్టం ద్వారా కలెక్టర్‌తో నిమిత్తం లేకుండా తహసీల్దార్లు, ఆర్డీవోలకే అధికారా లు కేటాయించనున్నారు. మ్యూటేషన్, చట్టబద్ధ హక్కుల నమోదు, భూ సమస్య లకు శాశ్వత పరిష్కారం, భూ రికార్డుల సవరణ, సాదాబైనామా, ఆక్యుపెన్సీ రైట్ సర్టిఫికెట్ దరఖాస్తులకు సంబంధించిన అంశాలు ఆర్డీవో పరిధిలో, విరాసత్‌తో పాటు మరికొన్ని అంశాలు తహసీల్దార్లకు అప్పగించనున్నారు. దీంతో సాదా బైనామా దరఖాస్తులు వేగంగా పరిష్కారం అవుతాయని రైతులు భావిస్తున్నారు.

అంజన్న హుండీ ఆదాయం రూ.4.17 లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయ అనుబంధ ఆలయమైన అగ్రహారం హనుమాన్ దేవాలయం హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ ఈవో ఆధ్వర్యంలో 5 నెలల హుండీలను విప్పి లెక్కించగా రూ.4 లక్షల 17 వేల 938 సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక వంశీయ ధర్మకర్త, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పడి పూజ నిర్వహిస్తున్న స్వాములు

సిరిసిల్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో సిరిసిల్ల హరిహరపుత్ర అయ్యప్ప దేవస్థానం గురుస్వామి రాచవిద్యాసాగర్, అర్చకుడు రమేష్ నేతృత్వంలో బుస్స పవన్-శావ్య దంపతుల ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. గురుస్వాములు విశ్వనాథం, బుడిమె శివప్రసాద్, బుస్స శ్రీనివాస్, నాగశంకర్, దేవదాస్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని జయిస్తే విజయమే

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయిస్తే అన్ని రంగాల్లో విజయం సాధిస్తారని హార్ట్ ఫుల్‌నెస్ కార్య నిర్వాహకుడు గణేశ్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు యోగా శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ వనజకుమారి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ఇల్లంతకుంట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అయ్యన్నగారి హరికృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని వెల్జిపూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడం ద్వారానే ఉద్యోగుల జీవితాలలో వెలుగులు వస్తాయన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కాట్నపెల్లి స్వామిరెడ్డి, డీటీఎఫ్ నాయకులు దొమ్మాటి మధుగౌడ్, అనురాధ, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన ప్రశ్నిస్తే తప్పుడు కేసుల కుట్ర

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని పేర్కొన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల పక్షాన కేటీఆర్ ప్రశ్నిస్తే తప్పుడు కేసుల కుట్రకు తెరలేపుతోందని బీఆర్ఎస్ నాయకుడు అందె సుభాష్ ఆరోపించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజా పాలన కాదని, ప్రజా సంకట పాలన అని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన సర్కారు వారి దృష్టిని మళ్లించేందుకు యత్నిస్తోందన్నారు. అడుగడుగునా ప్రభుత్వ తీరును ఎండగడుతున్న కేటీఆర్‌పై కక్షపూరితంగా వ్యవహరించి జైలుకు పంపాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చూస్తోందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన కేటీఆర్‌ను ముట్టుకుంటే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందన్నారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒరగబెట్టిందేమిటని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో ప్రజల చేతిలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. నాయకులు భాస్కర్, నర్సింలు, తిరుపతినాయక్, సీత్యానాయక్ ఉన్నారు.

దోసం చంద్రంకు పరామర్శ

గంభీరావుపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం తండ్రి శ్రీరాములు ఇటీవల మృతి చెందడంతో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు శుక్రవారం పరామర్శించారు. మాల మహానాడు జిల్లా అధికార ప్రతినిధి మల్యాల రాజవీర్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గంద్యాడపు రాజు, నర్మాల మాజీ సర్పంచ్ రాజు, నాయకులు ఉన్నారు.

గంభీరావుపేట మండలం ముచ్చర్లలో మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి తండ్రి కిష్టారెడ్డి ఇటీవల మరణించగా నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పరామార్శించారు.

వేములవాడ బస్సులను పూడూర్ నుంచి నడపాలి

కొడిమ్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ నుంచి జగిత్యాలకు నడుపుతున్న ఆర్టీసీ బస్సులను పూడూర్ నుంచి నడపాలని కరీంనగర్ ఆర్ఎంకు చెప్యాల మాజీ సర్పంచ్ అక్కపెల్లి రాజేశం శుక్రవారం వినతి పత్రం అందించారు. కనీసం రెండు బస్సులైన వేములవాడ నడిపి జగిత్యాల వయా పూడూర్ మీదుగా నడిపి గ్రామస్థులకు పూడూర్ వెళ్లేందుకు సౌకర్యం కలిపించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కథలాపూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న మండలంలోని కథలాపూర్, చింతకుంట, బొమ్మెన, భూషణరావుపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ దివాకర్‌రావు తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్లలో వార్షిక మరమ్మతుల దృష్ట్యా, కథలాపూర్, భూషణరావు పేట, దూలూరు, బొమ్మెన, తక్కళ్లపల్లి, ఊ ట్‌పల్లి, పెగ్గెర్ల గ్రామాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల దాకా త్రీఫేజ్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.